బాలికల ఆరోగ్యంపై నిర్లక్ష్యం

- పాఠశాలలు, కళాశాలల్లో నిలిచిన హైజెనిక్ కిట్ల పంపిణీ
- 'బాలికల ఆరోగ్య రక్ష కిట్' పునరుద్ధరించాలి
- కిట్లు అందజేయాలని తల్లిదండ్రుల వేడుకోలు



మానవపాడులో ఆరోగ్య రక్ష కిట్లపై అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

మానవపాడు: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే బాలికలకు హెల్త్ కిట్స్ అందడం లేదు. దీంతో జబ్బుల బారిన పడుతూ చదువుకు దూరమవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా గత ప్రభుత్వం శానిటరీ హెల్త్ అండ్ హైజెనిక్ కిట్ల పంపిణీ ప్రారంభించింది. ప్రభుత్వ పాఠశాల్లో 12 ఏళ్ల నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న బాలికలకు ఆరోగ్యం కోసం 'బాలికల ఆరోగ్య రక్ష కిట్' ప్రాంరభించింది. రూ.420 విలువైన కిట్‌లో 15 రకాల వస్తువులు అందిచేది. 2018–19లో కిట్ల పంపిణీ ప్రారంభించగా, మూడు నెలలకోసారి, సంవత్సరానికి నాలుగుసార్లు కిట్లు అందించింది. ఆ తర్వాత పంపిణీ నిలిచిపోయింది. నాలుగేళ్లుగా కిట్లు అందజేయకపోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రుల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థినుల ఆరోగ్యంపై దృష్టి సారించి కిట్లు అందజేయాలని కోరుతున్నారు.

8, 9, 10వ తరగతుల నుంచి..

గత ప్రభుత్వం పాఠశాలల్లో విద్యనభ్యసించే 8, 10వ తరగతి బాలికలతో పాటు ఇంటర్ విద్యార్థినులకు శానిటరీ, న్యాప్కిన్స్, సబ్బులు, కొబ్బరినూనె, షాంపులు బాటిల్, టూత్ పేస్ట్, బ్రష్, పౌడర్ వంటి 15రకాల వస్తువులతో కూడిన హెల్త్ కిట్లు పంపిణీ చేశారు. ఏడాదిన్నర కాలం పాటు సజావుగా కిట్లు అందజేశారు. కరోనా రావడంతో పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం విద్యార్థినులకు హెల్త్ కిట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా..

జోగుళాంబ గద్వాల జిల్లాలో జిల్లా వ్యాప్తంగా కేజీబీవీ పాఠశాలలు 12 ఉన్నాయి. వాటిలో 8, 9, 10వ తరగతి విద్యార్థులు 1742మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా కేజీబీవీ కళాశాలలో 1,022 మంది విద్యార్థినులు ఉన్నారు. జెడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా వ్యాప్తంగా చదువుతున్న విద్యార్థులు 13,854 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులు మొత్తం 29,296 మంది పాఠశాల, కళాశాలలో చదువుతున్నారు.

వస్తువులు కొనాలంటే భారమే..



హెల్త్ కిట్‌లో వస్తువులు బయట కొనాలంటే పేద విద్యార్థులకు భారంగా ఉంది. కరోనా తరువాత ఆరోగ్యం, శుభ్రత ముఖ్యమని చెబుతున్నారు. కానీ కిట్లు మాత్రం అందించడం లేదు. ప్రభుత్వం స్పందించి కిట్లు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– నందిని, పదో తరగతి, కేజీబీవీ మానవపాడు

ఆరోగ్య రక్ష కిట్లు అందడం లేదు



ఈ విద్య సంవత్సరం ప్రాంభమైన ఆరోగ్యకిట్లు అందడం లేదు గత ప్రభుత్వ విద్యార్థినుల కోసం 'బాలిక ఆరోగ్య రక్ష కిట్' ప్రారంభించింది. ఇందులో 15 రకాల వస్తువులు ఇచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం ఆరోగ్య రక్ష కిట్లు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– రేణుక, ఇంటర్, కేజీబీవీ, మానవపాడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

ప్రభుత్వ పాఠశాల్లో చదివే బాలికల ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన హెల్త్ హైజెనిక్ కిట్ల పంపిణీ కరోనా కారణంగా నిలిచిపోయింది. తిరిగి ప్రారంభిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుంది. జిల్లాలో నెలకొన్న పరిస్థితిపై ఉన్నతాధికారులు, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ కార్యాలయం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం.

– మహ్మద్ అబ్దుల్ ఘని, డీఈఓ, జోగుళాంబ గద్వాల

హరోంహర అడివేశ్వర

- కనుల పండువగా అడివేశ్వర స్వామి రథోత్సవం
- పాల్గొన్న ఎమ్మెల్యే విజేయుడు



రాజోళిలో రథాన్ని లాగుతున్న భక్తులు

రాజోళి: మండల కేంద్రంలో శివనామస్మరణతో మార్మోగింది. వేలాది మంది భక్తులు చేసిన పంచాక్షరి మంత్రంతో రాజోళిలో జాతర ప్రారంభమైంది. భ్రమరాంబ అడివేశ్వర స్వామి జాతర సందర్భంగా శనివారం రథోత్సవం నిర్వహించారు. అర్చకుల మంత్రాల నడుమ, భక్తుల జయజయధ్వానాల మధ్య అడివేశ్వర స్వామి రథాన్ని లాగి జాతర ప్రారంభించారు. కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు పాల్గొని రథాన్ని లాగారు. జాతరలు గ్రామాల్లో బంధాలను మరింత బలపరుస్తాయని, పెద్దల కాలంనాటి సంప్రదాయాలను కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.



జాతర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజేయుడు

జాతీయ టైలర్స్ డే సంబరాలు



విద్యార్థుల ప్రదర్శన తిలకిస్తున్న ఉపాధ్యాయులు

ధరూరు: ఒకేషనల్ విద్యలో భాగంగా మండలంలోని ఉప్పేర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టైలరింగ్ విభాగం నుంచి పిల్లలను వృత్తి విద్యలో నైపుణ్యం పెంపొందించుకోవడానికి ప్రొఫెషనల్ విద్య ఉపయుక్తం అవుతుందని పాఠశాల హెచ్‌ఎం గౌరిశంకర్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో టైలరింగ్ ఉపాధ్యాయురాలు మల్లేశ్వరి క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలు దివ్యభారతి ఆధ్వర్యంలోని పాఠశాలలో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు టైలరింగ్, కుట్టు అల్లికలు నేర్పించడం జరిగిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి రవీంద్రబాబు హాజరై విద్యార్థుల ప్రదర్శనలు తిలకించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

అమరవీరులకు ఘన నివాళి



అయిజలో మాదిగ అమర వీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: ఎస్సీ వర్గీకరణ సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివని ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడ్డాకుల నాగరాజు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దండోరా మద్దిలేటి అన్నారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న బాబసాహేబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ రిజర్వేషన్ల సాధనలో అమరులైన వారికి నివాళులర్పించారు. అనంతరం ఏబీసీడీ వర్గీకరణలో ప్రాణాలు అర్పించిన అమరుల చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ పోరాటంలో సురేందర్ మాదిగ, భారతి మాదిగ. ప్రసాద్ మాదిగ లాంటి ఉద్యమకారులు అసువులు బాసినట్లు పేర్కొన్నారు.

అయిజ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు పూలమాలలు వేసి నివాళులల్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్, రాజు, సుబ్బన్న, ప్రకాశం, తిమ్మన్న, మారెప్ప, జమ్మన్న, రాజు, కృష్ణ, ప్రసదా, బీమన్న, ఆంజనేయులు, నరేష్, మహేష్, ప్రభుదాస్, ఆనందరాజు, చంటి పాల్గొన్నారు.

- గట్టులో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న, మాజీ ఎంపీటీసీ కృష్ణ, బీఆర్ఎస్ నాయకుడు రామునాయుడు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహబూబ్‌పాష, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ బండారి డేవిడ్ అమర వీరులకు నివాళులర్పించారు.
- శాంతినగర్ ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కొంకల భీమన్న మాదిగ, ఐజ రాజు మాదిగ మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఏసేపు, రాజశేఖర్‌మాదిగ, రవి, భీమన్న, శేఖర్, ఘట్టన్న, మహేంద్రలు పాల్గొన్నారు.
- మల్దకల్ మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అమరులైన వారికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మోషన్న, చిన్న తిమ్మన్నలు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోవిందు, ఎమ్మార్పీఎస్ నాయకులు తిమ్మన్న, శేఖర్, రమేష్‌బాబు, సుధాకర్, మల్దకల్, ఇసాక్, దావీదు, సామేల్, ప్రభాకర్, దేవరాజు, జయరాజు పాల్గొన్నారు.
- మానవపాడు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అలంపూర్ ఇన్‌చార్జి జయరాజ్ మాదిగ అధ్యక్షతన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఏబీసీడీ వర్గీకరణలో అసువులు బాసిన అమరులకు పూలమావేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జగ్గుల వెంకన్న, చెన్నిపాడు జయన్న, మాదిగ అరుణ్‌కుమార్, సుధాకర్ మాదిగ, జగ్గుల శివరాముడు, తిరుపాలు, మద్దిలేటి, చెనిన్నపాడు మద్దిలేటి పాల్గొన్నారు.



గట్టులో అమరవీరులకు నివాళ్లు అర్పిస్తున్న నాయకులు



అలంపూర్‌లో..

మధ్యాహ్న భోజనం తనిఖీ



ధరూరు: మండలంలోని మార్లబీడు పాఠశాలను శనివారం ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బోధిస్తున్న వాటిపై అడిగి తెలుసుకుని విద్యార్థులను చదివించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పరిశీలించి ఏజెన్సీతో భోజనంపై ఆరా తీశారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వారి వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రజావేదికను విజయవంతం చేయండి

అయిజ: మండల కేంద్రంలో ఈనెల 4న నిర్వహించనున్న ప్రజావేదిక కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించిన 14వ విడత సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో నివేదిక రూపొందించారని తెలిపారు. వాటికి సంబంధించిన ప్రజా వేదికను మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ముందు ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

అచ్చమ్మవ్వకు చేయూత

శాంతినగర్: తనవారంటూ ఎవరూ లేకుండా దుర్భర జీవితం కొనసాగిస్తున్న అచ్చమ్మవ్వకు స్థానిక రామచంద్రానగర్ యువకులు తమవంతు సాయంగా చేయూత అందించి వారి ఉదారతను చాటుకున్నారు. రామాపురం రోడ్డు పక్కన పూరి గుడిసెలో దిక్కులేని స్థితిలో జీవనం సాగిస్తున్న అచ్చమ్మవ్వకు స్థానిక యువకులు అర్లరి రవి, మెకానిక్ మహబూబ్‌బాషలు 25 కేజీల బియ్యం అందజేశారు. భవిష్యత్‌లో అచ్చమ్మవ్వకు మరింత చేయూత అందిస్తామని వారు భరోసా ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించండి



అయిజ: పట్టణంలో ఇంటిగ్రేటెడ్ బస్టాండ్ ప్రయాణ ప్రాంగణం నిర్మించాలని బీజేపీ నాయకులు శనివారం జిల్లా కేంద్రంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ నారాయణకు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ, బీఎస్ఎన్ఎల్ డివిజనల్ ఇంజినీర్, రహదారులు, భవనాల శాఖ ఎస్ఈలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు. జిల్లాలో పెద్ద మండల కేంద్రంలో 15 ప్లాట్‌ఫాంలతో ఇంటిగ్రేటెడ్ బస్టాండ్‌ను నిర్మించాలని కోరారు. గద్వాల, కర్నూలు, రాయచూరు వెళ్లే రహదారుల్లో బస్ స్టాప్‌లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. కర్నూలు–రాయచూరు రహదారి కూడలిలో మినీ ప్రయాణ ప్రాంగణం నిర్మించాలని, జూనియర్ కళాశాల వద్ద బస్ షెల్టర్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దేవదాస్, అయిజ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి పాల్గొన్నారు.

తక్షణమే స్పందించి సేవలు అందించాలి



1962 అంబులెన్స్ సిబ్బందితో రాష్ట్ర హెడ్ బగిష్ మిశ్ర

అలంపూర్: గ్రామీణ ప్రాంతాల్లో కాల్ వచ్చిన తక్షణమే స్పందించి సేవలు అందించాలని 1962 ప్రాజెక్టు హెడ్ బగిష్ మిశ్ర సూచించారు. అలంపూర్ పట్టణంలోని జీవీకే ఈఎంఆర్ఐ అలంపూర్‌కు సంబంధించిన 1962 పశు సంవర్ధక శాఖ అంబులెన్స్ రాష్ట్ర ప్రాజెక్టు హెడ్ బగిష్ మిశ్ర శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని వివిధ పరికరాలు, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. మందులను పరిశీలించి వివరాలు సేకరించారు. జిల్లాలోని ప్రతి అంబులెన్స్ 10 ట్రిప్పులు, 20 జంతువులకు సేవలు అందించాలని సూచించారు. వీరితో పాటు ఎగ్జిక్యూటివ్ రత్నమయ్య, డాక్టర్ సోనారెడ్డి, పరావేట్ మోహన్, హెల్పేర్ గోకారి, కెప్టెన్ కృష్ణ, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సోషల్ ఆడిట్



వెంకటనాపురంలో సోషల్ ఆడిట్ న్విహిస్తున్న అధికారులు

అయిజ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో ఈఏడాది నిర్వహించిన పనులపై సోషల్ ఆడి ట్ కొనసాగుతోంది. శనివారం డీఆర్‌పీ శివశంకర్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌పీలు వివిధ గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్‌పీ మాట్లాడారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు నిర్వహించిన ఈజీఎస్ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం రూ. 3.77 కోట్లు ఖర్చు చేయగా, దాంట్లో రూ.25లక్షలు పనిముట్ల కోసం ఖర్చు చేసినట్లు తెలిపారు. గత నెల 21 నుంచి సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

మల్దకల్: జాబు కార్డులు ఉన్న కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని గ్రామాల్లో వారి సంఖ్యను మరింత పెంచాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు, నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు ఉపాధి హా మీ పనులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అన్ని గ్రా మాల్లో 100 రోజులకు పైగా కూలీలు పనులు చేసే విధంగా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. గతంలో నాటిన మొక్కలకు నీరు అందించి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలి



సదస్సులో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

గద్వాలటౌన్: ముస్లిం మైనార్టీల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వాల్మీకి భవన్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'రాజ్యాంగ పరిరక్షణ– వక్ఫ్‌బిల్లుపై పొరచర్చ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్, న్యాయవాది షఫిఉల్లా, అఖిలపక్ష నాయకులు అతికూర్ రహమాన్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, మధుసూదన్ బాబు, ప్రభాకర్, వెంకటస్వామి, ఆంజనేయులు, ఇసాక్ తదితరులు మాట్లాడారు. పార్లమెంట్‌లో నియమించిన జేపీసీలో ప్రతిపక్ష సభ్యులు సూచించిన ఒక్క సవరణను ఆమోదించకుండా నియంతృత్వంగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రజాస్వామిక చర్చలు లేకండా అమలు చేస్తున్న వక్ఫ్‌బిల్లును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. వక్ఫ్‌బోర్డు బిల్లును ఉపసంహరించుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు ఫయాజ్, రహమతుల్లా, నసురుల్లా, మహబూబ్‌అలీ, పల్లయ్య, గోపాల్‌రెడ్డి, సాదుతుల్లా, బాషా, మక్బూల్, తాహేర్ జమాలుద్దీన్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



గోపల్‌దిన్నెలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోస్తున్న అధికారులు

ఇటిక్యాల: మండలంలోని గోపల్‌దిన్నె గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నిర్మించే ఇందిరమ్మ మోడల్ గృహానికి హౌసింగ్ శాఖ డీఈ నరేంద్రుడు ముగ్గు పోసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఇల్లులేని వారిని గుర్తించి లబ్ధిదారులుగా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లను అందిస్తున్న గంగు శ్రీకాంత్‌రెడ్డి, గంగు బృంద

మానవపాడు: విద్యార్థులు భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని దాత గంగు శ్రీకాంత్‌రెడ్డి, గంగు బృంద తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు 500 ప్లేట్లు ఎంఈఓ శివప్రసాద్‌తో కలిసి పంపిణీ చేశారు. పాఠశాలకు ఎల్లప్పుడు సహాయ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రామ్మూర్తి, శ్రీనివాసరెడ్డి, వేణుగోపాల్, రియాజ్, రికార్డు అసిస్టెంట్ యోగీశ్వర్, మద్దిలేటి, జనార్దన్, రమేష్‌బాబు, హన్మన్న, స్వరూపరాణి పాల్గొన్నారు.

ఆడపిల్లలే సమాజానికి మణిహారం



ఆలూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

గట్టు: ఆడపిల్లలే సమాజానికి మణిహారం అని, అమ్మాయిల పట్ల వివక్షత చూపకుండా సమానంగా చూ డాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జెండర్ స్పెషలిస్ట్ చిట్టెమ్మ కోరారు. శనివారం ఆలూరు ఉన్నత పాఠశాలలో బేటీ బచావో, బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బేటీ బచావో, బేటీ పడావో పథకం జనవరితో 10 ఏళ్లు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. గత దశాబ్ది కాలంలో ఇది ఒక కీలక పరివర్తన అని, లింగ అడ్డంకులు, వివక్షతను అదిగమించినట్లు తెలిపారు. ఫైనాన్సియల్ లీటరసీ నాగరాజు మాట్లాడుతూ బాలబాలికల లింగ నిష్పత్తి సమానత్వం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, పిల్లలందరూ చక్కగా చదువుకోవాలని కోరారు. కమ్యూనిటీ ఎడ్యుకేటర్ కృష్ణయ్య మాట్లాడారు. విద్యార్థులు, యువకులు డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. బేటీ బచావో, బేటీ పడావోపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ నాగరాజు, సఖి సీఏ శోభ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి



అయిజ: మండలంలోని సంకాపురంలో రామకృష్ణ ధ్యాన మందిరంలో శనివారం రామకృష్ణ సేవా సమితి సభ్యులు రామకృష్ణ పరమహంస జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడారు. భిన్న మతాలు భగవంతుడిని చేరడానికి విభిన్న మార్గాలు అని ప్రపంచానికి చాటిచెప్పిన మహా వ్యక్తి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సభ్యులు సత్యనారాయణ, వెంకట్రాములు, కృష్ణ, గోపాల్, బ్రహ్మయ్య, తిమ్మప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో డీఏఓ తనిఖీ



ధరూరు: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా ఇన్‌చార్జి డీఏఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం మండల ఏఓ అధికారి శ్రీలతతో కలిసి ధరూర్‌లోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టార్‌లను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను అందించడంతో పాటు ఎరువులు యూరియా కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రతి దుకాణం ముందు విధిగా ధరల పట్టిక ఏర్పాటు చేయాలని రైతులకు ఆన్‌లైన్ పద్ధతిలో ఎరువులను అందించాలని సూచించారు. రైతులకు ఇబ్బందికలిగేలా చేస్తే చర్యల తీసుకుంటామన్నారు. అంతకు ముందు రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో డీఏఓ, రైతులు పాల్గొన్నారు.

కుక్కలదాడిలో ఆవుదూడకు గాయాలు

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె గ్రామంలో కుక్కల దాడిలో ఆవుదూడకు తీవ్ర గాయాలయ్యాయి. రైతు తిరుపతిరెడ్డి పశువులను తన వ్యవసాయపొలంలో కట్టేశాడు. శనివారం ఆవు దూడపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గ్రామంలో చికెన్ వ్యర్థ పదార్థాలు బహిరంగ ప్రదేశాలలో వేస్తున్నారని, దీని వల్ల వీధి కుక్కల బెడద ఎక్కువైపోయిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇతర గ్రామాల నుంచి సేక రించిన వీధి కుక్కలను నందిన్నె గ్రామంలో వదిలి పెట్టడం వల్ల గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని దీంతో స్థానికులు కుక్కలతో తమకు రక్షించాలని గ్రామ పంచాయతీ అధికారులతో మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టిప్పర్ పట్టివేత

గద్వాల క్రైం: మైనింగ్‌శాఖ అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్న సంఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ కథనం మేరకు.. జమ్మిచెడ్ గ్రామానికి చెందిన ఆనంద్ గద్వాల మండలం వీరాపురం గ్రామ శివారులోని ప్రభుత్వ భూముల నుంచి జేసీబీల సహాయంతో మట్టి తరలిస్తున్నారు. తెల్లవారుజామున వీరాపురం నుంచి గద్వాల మీదుగా మట్టి టిప్పర్‌ను తీసుకెళ్తున్నట్లు సమాచారం రావడంతో పట్టణ శివారులో టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్‌ను అనుమతి పత్రాలు కోరగా, లేవని సమాధానం చెప్పాడు. దీంతో టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించి మైనింగ్‌శాఖకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి, ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే



గట్టు: మండలంలోని రాయాపురం గ్రామానికి చెందిన కుర్వ భీమన్న కుటుంబ సభ్యులను శనివారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల కుర్వ భీమన్న అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాయాపురం వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మాచర్ల గ్రామంలోని నర్సింహులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజేష్ తండ్రి గుర్రం బాయి రాజన్న అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, రామకృష్ణారెడ్డి, మోహన్‌గౌడు, రాజప్ప, రంగస్వామి, ప్రవీణ్, మాచర్ల అలీ, సురేష్, శ్రీనివాసరెడ్డి, సిద్దు, ఆనంద్ పాల్గొన్నారు.